# వెల్లుల్లి

వెల్లుల్లి ఉష్ణ మండల పంట. మన రాష్ట్రంలో రబీ పంటగా పండించబడుతోంది. ఎకరాకు 40.0 క్వింటాళ్ళ సరాసరి దిగుబడినిస్తుంది.

**వాతావరణం:** తక్కువ ఉష్ణోగ్రతలో ($12-18^0$ సెం.) పెరుగుతుంది. అధిక తేమను, వర్షాన్ని, బెట్ట పరిస్థితులను, మురుగునీటి సౌకర్యం లేని పరిస్థితులను తట్టుకోలేదు.

**నేలలు:** బంక నేలలు, నీటిపారుదల మరియు మురుగు నీటి వసతి గల సారవంతమైన గరప నేలలు అనుకూలం.

**రకాలు:** మన రాష్ట్రంలో గుర్తించబడిన వెల్లుల్లి రకాలు ఏమీ లేవు. రాజస్థాన్ ప్రాంతపు 'రామ్‌నగర్' రకాన్ని మరియు పెద్ద పాయలను కలిగి ఉండి, తెల్లని రంగు గలిగిన దేశవాళీ రకాలను మన రాష్ట్రంలో విరివిగా పండిస్తున్నారు. ఎన్.హెచ్.ఆర్.డి.ఎఫ్. వారు సిఫారసు చేసిన రకాలు కూడా పండించుకోవచ్చు.

**జి-41 (ఏ ఎ డి పి):** పాయలు మధ్యస్థ తెలుపు వర్ణంతో వుండి అధిక దిగుబడినిచ్చే రకం.

**ఊటీ-1:** ఉద్యాన పరిశోధనా స్థానం, ఊటీ, తమిళనాడు నుండి విడుదలయిన రకం. పాయలు పెద్దవిగా వుండి తక్కువ తెలుపుతో ఒక్కోగడ్డలో 20-25 పాయలు కలిగి వుంటుంది. తామర పురుగులను తట్టుకొని అధిక దిగుబడినిస్తుంది. పంటకాలం 120-130 రోజులు. దిగుబడి ఎకరాకు 68 క్వింటాళ్ళు.

ఇవికాక అగ్రిఫౌండ్ వైట్ మరియు యమునా సఫేద్ అను రకాలు ఎక్కువ దిగుబడినిచ్చే మేలైన రకాలు.

**విత్తటం:** గడ్డలోని పాయలను వ్యాప్తికొరకు వాడతారు. వరుసల మధ్య 25 సెం.మీ., వరుసల్లో 10 సెం.మీ. ఎడంలో పాయలను నాటుకోవాలి. పాయలు విత్తిన వెంటనే నీటిని తప్పకుండా పెట్టాలి.

**విత్తన మోతాదు:** ఎకరాకు 200-240 కిలోల విడిపాయలు అవసరం.

**విత్తేసమయం:** పాయలను సెప్టెంబరు 15 నుండి అక్టోబరు చివరి వరకు విత్తుకోవచ్చు.

**ఎరువులు:** ఆఖరి దుక్కిలో ఎకరాకు 6-8 టన్నుల పశువుల ఎరువు వేయాలి. తేలిక పాటి నేలల్లో ఎకరాకు 24:14:24 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ ఆఖరు దుక్కిలో వేయాలి. చిన్న చిన్న మళ్ళుగా చేసుకొని విత్తుకుంటే నీటి పారుదలకు అనుకూలంగా వుంటుంది.

**నీటి యాజమాన్యం:** పాయలను విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వాలి. తర్వాత 10 రోజులకు ఒకసారి నీటిని ఇవ్వాలి. గడ్డ ఎదిగే దశలో తప్పనిసరిగా నీరు కట్టాలి.

**కలుపు నివారణ, అంతరకృషి:** విత్తే ముందు ఫ్లూక్లోరాలిన్ 45% ఎకరాకు ఒక లీటరు చొప్పున పిచికారి చేసి భూమిలో కలియదున్నాలి లేదా పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.3 నుండి 1.6 లీ. లేదా ఆక్సిఫ్లోరోఫిన్ 23.5% 200 మి.లీ. చొప్పున ఏదో ఒకదానిని నాటే ముందు పిచికారి చేయాలి లేదా నాటిన 2, 3 రోజుల్లో తేమ ఉన్నపుడు ఎకరాకు ఆక్సీఫ్లోరోఫిన్ 23.5% 200 మి.లీ.లను 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. నాటిన 30, 45 రోజుల మధ్య మరలా కలుపు తీసి మట్టిని ఎగదోయాలి.

నత్రజని ఎక్కువైతే పాయలు మెత్తగా స్పాంజి లాగా తయారవుతాయి. కాబట్టి నత్రజని ఎక్కువగా వాడకూడదు. అలానే లీటరు నీటిలో 1 గ్రా. జింక్‌సల్ఫేట్+3 గ్రా. అమ్మోనియం సల్ఫేట్+1 గ్రా. మాంగనీస్ సల్ఫేట్ కలిపి

పాయలు నాటిన 30, 45, 60వ రోజున పిచికారి చేయాలి. లేదా 2.5 గ్రా. మాలిక్ హైడ్రజైడ్ లీటరు నీటికి కలిపి 30, 60, 90వ రోజున పిచికారి చేయాలి. అయితే ఈ ద్రావణానికి 1 గ్రా. శాండోవిట్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేస్తే మందు ఆకులకు బాగా పడుతుంది. దీని వలన నిలువలో మొలకెత్తదు, పాయలు స్పాంజి మాదిరిగా మారవు.

**సస్యరక్షణ:** వెల్లుల్లిని ముఖ్యంగా రసం పీల్చు పురుగులు అయిన పేనుబంక ఎక్కువగా ఆశిస్తుంది. ఈ పురుగులు ఆకుల నుండి రసాన్ని పీల్చడంవల్ల ఆకులు పండుబారి ఎండిపోతాయి. పాయల పరిమాణం బాగా తగ్గిపోతుంది. తద్వారా దిగుబడి కూడా తగ్గిపోతుంది. వీటి నివారణకు అంతర్వాహిక కీటక నాశినులైన డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**కుళ్ళుతెగులు:** పాయలు విత్తినప్పుడు మొలకలు వచ్చే లోపుగా ఈ కుళ్ళుతెగులు ఆశిస్తుంది. దీని వలన మొక్క రాక, పంటకు నష్టం కలుగుతుంది. దీని నివారణకు, పాయలను విత్తేముందు కార్బండజిమ్ 1 గ్రా. ఒక కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**కోత:**వెల్లుల్లి మొక్కల ఆకుల చివర్లు గోధుమ వర్ణంలోకి మారినపుడు మరియు ఎండినపుడు గడ్డలు త్రవ్వి తీయాలి. వెల్లుల్లి ఆకులను ఒకచోటికి చేర్చి 3-4 రోజులు వెలుతురు ఉండే గదుల్లో నిల్వచేయాలి.

**దిగుబడి:** ఎకరాకు 32-48 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది.

**నిల్వ ఉంచడం:** కోతకు 12 రోజుల ముందు మడిలో నీరు కట్టాలి. కోసిన వెంటనే గడ్డలను పొలంలోనే 3 రోజుల పాటు కుప్పగా పోసి వుంచి (ఫీల్డ్‌క్యూరింగ్), తర్వాత నిల్వ చేయాలి. ఫీల్డ్ క్యూరింగ్ చేయడం వల్ల గడ్డలు ఎక్కువ కాలం నిల్వ వుంటాయి.


వెలుల్లి సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

**సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, ఉద్యాన పరిశోధనా స్థానం,**

అదిలాబాద్ 504001. ఫోన్: 08732-220458.